


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**ఆమెనింకా ఆ దిగ్భ్రమ వదల్లేదు.** అసలు తను మాట్లాడిందీ, అతడు దానికి ఒప్పుకున్నదీ ఆమె జీర్ణం చేసుకోలేక పోతోంది. 'వ్యాపార చర్చల్లో ప్రతి చిన్న విషయమూ ఆచీ తూచీ మాట్లాడే తనేనా ఇలా నోరుజారింది?' ఆమె నమ్మలేకపోతోంది.

''నేను డాక్టరీ చదివానని తెలియగానే నీ సంబోధన 'నువ్వు' లోంచి 'మీరు' లోకి మారిందన్నావు. ఇప్పుడు నువ్వు పైసాకు ఠికాణా లేనిదానివి కాబట్టి నా సంబోధన 'మీరు'... లోంచి 'నువ్వు' లోకి మారింది. అంతవరకూ ఎందుకు? నీ మనస్తత్వం గురించి ఒక్క ఉదాహరణ చెబుతాను విను. నీకు ట్రెకియాస్టమీ చేసింది నీ ఫ్యామిలీ డాక్టర్ కాదు. నేను. ఒక ప్రశ్న సూటిగా అడిగితే ఆ విషయం మేమే నీకు చెప్పేవాళ్ళం. నువ్వలా చెయ్యలేదు. తలుపులన్నీ వేసి పిల్లిని కొట్టినట్టు ఆ డాక్టర్ని అబద్ధాలన్నీ చెప్పనిచ్చి, ఆ తరువాత గొప్ప తెలివితేటల్తో నిజాన్ని రాబట్టినట్టు ఆయన్ని ఫూల్‌ని చేశావు'' అని ఒక క్షణం ఆగి, ప్రశాంతమైన స్వరంతో అన్నాడు: ''మనుష్యుల మీద అంత అపనమ్మకం కూడదు కళ్యాణీ. మనిషి కష్టాల్లో ఉన్నప్పుడే అతని సిద్ధాంతీకరణలు మారుతాయి. కొంతకాలం కష్టాలు అనుభవించు. ఇవిగో నా బొమ్మలు. ఆస్తి వ్రాసివ్వు.''

- అంటూ అతడామె చేతిలో పెయింటింగ్స్ పెట్టబోతూ ఆగి ''ఈ క్షణంలోనైనా కావాలంటే మీరు మీ మాట వెనక్కి తీసుకోవచ్చు మాడమ్. నేనా మాట అనలేదూ అని ఓమాట అనండి. ఆస్తి దక్కుతుంది. చెప్పండి. కాంట్రాక్టు కాన్సిల్ చేసుకుందామా?'' అన్నాడు.

''అవసరం లేదు. రేపే రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేస్తాను'' అని అతడి చేతుల్లోంచి ఆ కాగితాలు విసురుగా తీసుకుంది. ఆమె అతడి మొహంలోకి సూటిగా చూస్తూ అంది: ''వ్యాపారం వ్యాపారమే కార్తికేయా. జీవితంలో అబద్ధం చెప్పటం నీకెలా అలవాటు లేదో వ్యాపారంలో మాట తప్పటం నాకు అలవాటు లేదు.''

2

శ్రీకళ్యాణి తన బెడ్‌రూములో వెల్లకిలా పడుకుని ఉన్నదల్లా లేచి క్రింద కార్పెట్ మీద పడుకుని, 'రేపట్నుంచీ నేనిలాగే కదా' అనుకుంటూ వత్తిగిల్లింది. అయిదు నిముషాలకల్లా ఒళ్ళు నొప్పులు పెట్టాయి. తన ఆలోచన తనకే సిల్లీగా అనిపించి తిరిగి వెళ్ళి తన పక్కమీద పడుకుంది.

ఆస్తి పోయిన మరుక్షణాన తను బికారిగా రోడ్డున పడాల్సి వస్తుందని గానీ, కటిక దారిద్ర్యాన్ని అనుభవించాల్సి ఉంటుందని కానీ ఆమె ఏనాడూ అనుకోలేదు. ఎన్నో కంపెనీలు తనని ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా తీసుకోవడానికి రెడీగా ఉంటాయి. ఎన్నో బ్యాంకులు తనకి రుణం ఇవ్వటానికి తయారుగా ఉంటాయి. తనకున్న సంబంధాలతో ఏడాది తిరిగేసరికల్లా నిలదొక్కుకోవచ్చు. అదికాదు సమస్య. గురి చూసి ఎంత దెబ్బకొట్టాడు కార్తికేయ..! అంతా చెప్పిన తరువాత చివర్లో అతని నవ్వు తల్చుకుంటే ఒళ్ళు మండిపోతోంది. హృదయం అవమానంతో రగిలిపోతోంది. ఓటమి ఒప్పుకునే గుణం కాదామెది. ఆస్తి సంగతి పక్కన పెడితే, 'ఇంతకు ఇంతా' పాఠం అతడికి ఎలా చెప్పాలన్న ఆలోచనలతో నిద్రపట్టడం లేదు.

ఏ వ్యాపారబంధంలో అయినా, ఏ పనిలో అయినా, ఆమెకు ఒకటే పట్టుదల. 'లాస్ట్‌లాఫ్' తనది అవ్వాలి! దానికోసం ఏం చెయ్యాలా అని తీవ్రంగా ఆలోచించసాగింది. ఆమె ఆశయం ఒక్కటే. తానిప్పుడు ఎలా నిస్సహాయంగా నిలబడ్డదో తనముందు అతనూ అలా దీనంగా నిలబడాలి. 'చూశావా. ఆ రోజు నైతిక విలువలు గురించి అన్ని కబుర్లు చెప్పావు. డబ్బు విషయం వచ్చేసరికి నువ్వూ అలాగే ప్రవర్తించావు' అని తను అనాలి. దానికోసం ఏం చెయ్యాలి?

ఏదైనా చెయ్యాలి! ఏదైనా సరే!! ఏదో ఒకటి చెయ్యాలి..!!! తన అహం సంతృప్తి చెందటం కోసం, తన థియరీ కరెక్ట్ అని నిరూపించటం కోసం, డబ్బు లేనప్పుడు ఉన్న నైతిక విలువలు డబ్బు ఉన్నప్పుడు ఉండవని చెప్పటం కోసం... ఆమె ఆలోచించసాగింది.

వ్యాపారంలో ప్రత్యర్థిని పడగొట్టడం కోసం – తన కంపెనీలో లంచగొండి ఉద్యోగిని రెడ్ హేండెడ్‌గా పట్టుకోవడం కోసం – ఎంత ఏకాగ్రతతో ఆలోచిస్తుందో అంత తీవ్రంగా ఆలోచించింది. తరువాత ఎవరికో ఫోన్ చేసింది.

అదే సమయానికి క్రింద హాల్లో నేల మీద పడుకున్న కార్తికేయ నిద్రలో కలగంటున్నాడు. అందమైన అమ్మాయి అలవోకగా విసిరిన జడ చివరి కుంచెతో బొమ్మ వేస్తున్నట్టు ఓ కల. అది చెదిరి కళ్ళు తెరిస్తే, కాళ్ళ దగ్గర ఆకృతి సజీవ శిల్పంగా తోచి చప్పున లేచి కూర్చుని లైటువేస్తే... ఆమె కళ్యాణి.

అప్పుడు టైమ్ ఒంటిగంటయింది. లోచనం విభ్రమంగా, మనోలోచనం సందిగ్ధం కాగా, ''మీరా? ఈ వేళప్పుడు మీరు ఇక్కడ?'' అన్నాడు అయోమయంగా.

ఆమె నెమ్మదిగా తలెత్తింది. తల పైనుంచి భుజాలమీదుగా వేసుకున్న పైట చెరగు కాస్త జారగా తిరిగి సర్దుకుని, అస్పష్టమైన ఆలోచనకి స్పష్టమైన రూపం ఇచ్చే పదాల కోసమా అన్నట్టు గుటకమింగి సర్దుకుని, ''మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారా కార్తికేయా?'' అంది.

అతడు ప్రతారితుడైనాడు. ఆమె ప్రతిహారికయైనది. మనసు ప్రకామమై, భావము ప్రచోధనమై, మాట ప్రక్వము కాగా, ప్రణీతయై ఆ ప్రణయిని చేసిన ప్రతిపాదనకు అతడు ప్రతిబద్ధుడైనాడు. అది కలకాదని నిశ్చయించుకున్నాక, ''మీరేం మాట్లాడుతున్నారో మీకు అర్థమవుతోందా?'' అని అడిగాడు.

''మీరు అహంభావం అనుకోకపోతే ఒక మాట. నేను ఏ నిర్ణయమూ తొందరపడి తీసుకోను. మీకేం తక్కువ? గుణముంది. అందముంది. అన్నిటికన్నా మించి 'స్వార్థం' లేదు. నాకు తెలిసినంతలో డబ్బుకి లొంగని ఏకైక వ్యక్తి మీరు. ఒక్క సంవత్సరం చదువుతో డాక్టర్ అవుతారు. చేతిలో గొప్ప కళ ఉంది. ఇంకేం కావాలి'' అంది.

అతడింకా విభ్రమం నుంచి తేరుకోలేదు.

''మీరు నన్ను నమ్మలేరా? ఈ సౌఖ్యాలన్నీ వదులుకోవటం ఇష్టంలేక మీ ఆస్తి కోసమే నేనీ పెళ్ళికి ప్రపోజ్ చేశాననీ అనుకుంటున్నారా?''

అతడు కదిలిపోయాడు. ''ఛ. ఛా... అలాంటిదేమీ కాదు'' అన్నాడు.

"ఒక్కటి మాత్రం నమ్మండి. నా పోయిన ఆస్తి కోసం  నేనీ కోరిక కోరటం లేదు. దాని కోసమైతే, మీ చిత్రపటాలు కొంటానని ఎప్పుడన్నానని  ఎదురు తిరిగేదాన్ని. నాకు ఇక డబ్బు మీద ఆశ లేదు. ఈ బిజినెస్ వ్యవహారాలన్నీ వదిలేసుకోమంటే వదులుకుంటాను. అన్నీ మీరే చూసుకోండి".

అతడికి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. ఆమె తనని డబ్బు కోసం చేసుకోవటం లేదన్నది నిర్వివాదాంశం. శ్రీకళ్యాణిలాంటి వ్యక్తిత్వంగల అమ్మాయి దేన్నైనా భరిస్తుంది గానీ వ్యక్తిత్వం పోగొట్టు కోదు.

ఆ అయోమయ సందిగ్ధావస్థలో అతడు చాలాసేపు తటాపటాయించి ''నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి'' అన్నాడు. ఈసారి ఆమె బిత్తరపోయింది. ఈ సమాధానాన్ని ఆశించలేదు. ఆమె కళ్ళ వెంట అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. ''ప్రస్తుతం నేను దేనికీ కొరగాని దాన్ననేగా ఆలోచించుకోవటానికి టైమ్ ఇమ్మంటున్నారు?'' అంది.

''ప్లీజ్. తెల్లవారనివ్వండి'' క్లుప్తంగా అన్నాడు కార్తికేయ. ఆమె నెమ్మదిగా లేచి 'మీ ఇష్టం' అని కదిలి మెట్లెక్కి చీకట్లో అదృశ్యమైంది. సరీగ్గా అప్పుడు గడియారం రెండు కొట్టింది. ఆ రాత్రి ఆమెకి మరి నిద్రపట్టలేదు. మాగన్నుగా నిద్రపడుతున్న వేళకి ఫోన్ మ్రోగింది. అప్పుడు టైమ్ అయిదు కావస్తోంది. ఆమె ఫోన్ ఎత్తి ''హలో'' అంది.

ఫోనోగ్రామ్ అది..! ఆ వార్త వింటూనే ఒక ఉదుటున బ్లాంకెట్ విసిరేసి పక్క మీద లేచి కూర్చుంది. సత్యానికి ఫోన్ చేసి వెంటనే బయల్దేరి రమ్మంది. 'ఇంత ప్రొద్దున్నా' అన్నాడు.

''అవును. చాలా ముఖ్య విషయం'' తనని తాను కంట్రోల్ చేసుకుంటూ అంది. ఆమె టెన్షన్ గమనించినట్టు సూర్యుడు కూడా తొందరగా బయటకు వచ్చాడు. అయిదున్నరకే వెలుతురు వచ్చేసింది. ఆమె ఇప్పుడు నూరు శాతం

వ్యాపారవేత్తలా ఉంది. వరుసగా నాలుగైదు ఫోన్లు చేసింది. ఫోన్‌లో మాట్లాడేక ఆమె డ్రస్సింగ్ టేబిల్ దగ్గరకు వెళ్లింది.అక్కడుంది ఓ చిన్న ప్యాకెట్. పక్కనే చిన్న ఉత్తరం.

ఆమె ఆశ్చర్యంగా దాన్ని విప్పి చదివింది.

*శ్రీకళ్యాణిగారూ,*

*నమస్తే, నిన్న రాత్రి మీరు ఏ మూడ్‌లో నా వద్దకొచ్చి మీ ఉద్దేశ్యం చెప్పారో నాకు అర్థం కాలేదు. మనిద్దరం ఎప్పుడు మాట్లాడుకున్నా అది సిద్ధాంత చర్చకో, వాదోపవాదాల్లోకో వెళ్ళటం జరుగుతోంది. ఈసారి కూడా అదే అనుకోకపోతే ఒక్క విషయం చెపుతాను. ప్రేమంటే రాత్రి పదింటికి పుట్టి, పన్నెండింటికి పెళ్ళికి దారితీసేది కాదు. అదొక రసరమ్య రసానుభూతి.*

*కళ్యాణిగారూ!*

*మీరు చాలా గొప్పవారు. చాలామందిలాగా ఊరికే కబుర్లు చెప్పకుండా మీరనుకున్నదాన్ని చేసి చూపిస్తున్నారు. పదిమందికి తిండి పెడుతున్నారు. పదిమందితో శభాష్ అనిపించు కుంటున్నారు. కోట్ల వ్యాపారాన్ని వేళ్ళమీద నడిపిస్తున్నారు. మీ రంగంలో మీరు గొప్ప.నేను పెయింటర్‌ని. సూర్యోదయపు ఎరుపునీ, సూర్యాస్తమయపు నారింజ రంగునీ ఎలా మిళితం చేయవచ్చా అని ఆలోచిస్తూ ప్రొద్దున్నుంచీ సాయంత్రం వరకూ గడిపే భావకుణ్ణి.*

*ప్రతి మనిషికీ ఒక స్వభావము, కొన్ని గుణాలు, ఇష్టా ఇష్టాలూ ఉంటాయి. అవతలివారికి అవి బలహీనతలుగా కనపడవచ్చు. నా భావుకత్వం మీకు 'నిస్తేజం'గా కనపడవచ్చు. మీ రేయింబవళ్ళ కృషి నాకు మెటీరియలిజంగా కనపడవచ్చు. నిన్న రాత్రి మీరు వచ్చి వెళ్ళాక ఆలోచిస్తే నాకు ఈ సత్యం బోధపడింది. మీ ఆస్తి సంగ్రహించి నేను మీకు పాఠాలు చెప్పదల్చుకోవటం ఏమిటి? నాకు సిగ్గుగా ఉంది. వ్యాపారంలో మీరు అనుభవించే టెన్షన్‌తో ఒక్కరోజు గడపవలసి వస్తే నాకు పిచ్చెక్కడం ఖాయం. మీ గొప్పతనం గుర్తించటం పోయి ఒక గొప్ప మానసికవేత్తలా మిమ్మల్ని బాగుచేయాలన్న ఆలోచన రావటమే నా బలహీనత. అందుకని నేనే ఒక డాక్టర్ దగ్గరకు వెళ్లాలి.*

*నిన్న రాత్రి మీరు తీసుకున్న నిర్ణయం గుర్తొస్తే ఈపాటికి మీకే నవ్వొస్తూ ఉండి ఉంటుంది. దాన్ని ఒక చాలా సాధారణ విషయంగా మర్చిపోండి. రేపు నేను కలకత్తా వెళ్ళిపోతున్నాను. ఎలాగయినా శాంతినికేతన్‌లో చేరాలన్నది నా కోరిక.*

*మీ ఆస్తి తాలూకు అగ్రిమెంటు పేపర్లు ఇక్కడే వదిలేస్తున్నాను. 'నాకు నీ దానం అక్కర్లేదు' అనకండి ప్లీజ్. మనం మంచి స్నేహితులుగా విడిపోదాం. మీరోమాట అన్నారు గుర్తుందా? 'నీ పెయింటింగ్స్ నా హాలు గోడలకయితే మరింత అందాన్ని సంతరించుకుంటాయి' అని– నిజమే. మన గమ్మత్తయిన పరిచయానికి గుర్తుగా, ఈ చిన్న... బీద బహుమతిని తీసుకోండి. నా పెయింటింగ్స్!! వాటిని ప్యాక్ చేయడం కోసం– ఆకాశాన్నించి ముక్క కత్తిరించి, ఇంద్రధనుస్సు రిబ్బనుగా కట్టి, దానికి నక్షత్రాన్ని గుచ్చి ఇస్తున్నాను. కాదనకండి.*

*– కార్తికేయ.*

ఆమె ఉత్తరం చదవటం పూర్తిచేసి అలాగే కుర్చీలో కూర్చుంది. బల్లమీద పెయింటింగ్స్, అగ్రిమెంట్ పేపర్లూ ఉన్నాయి. మనసులో ఏమున్నదో గానీ ఆమె మొహం మాత్రం భావరహితంగా ఉంది. కొద్దిసేపటికి మెట్లమీద చప్పుడైంది. సత్యం హడావుడిగా లోపలికి వచ్చాడు. మెట్లెక్కిన ఆయాసంతో వగరుస్తూ ''ఏమిటి నువ్వు చెప్పింది నిజమేనా?'' అడిగాడు.

ఆమె తల పైకెత్తి టెలిగ్రాం కాగితం అతనికి అందించింది. కంపిస్తూన్న చేతుల్తో అతడు దాన్ని అందుకుని చదివి ''మైగాడ్'' అన్నాడు. ఆమె మొహం ఇంకా అభావంగానే ఉంది. దాన్ని గమనించి అతడు ''ఏమిటి? ఏమీ పట్టనట్టు అలా కూర్చున్నావ్?'' అన్నాడు.

ఆమె అతడివైపు ఒకసారి చూసి తల దించుకుంది. అతడు టెలిగ్రాం వైపు మరోసారి పరికించి ''నువ్వేమీ చేయవా?'' అన్నాడు.

ఆమె చివాలున కుర్చీలోంచి లేచి ''...ఏం చెయ్యమంటావ్? ఇన్సూర్ చేయని షిప్పు మునిగిపోయిందని పేపర్లో అడ్వర్టయిజ్‌మెంట్ ఇవ్వమంటావా? రెండు కోట్లు నష్టం వచ్చి శ్రీకళ్యాణీ ఏజెన్సీ దివాళా తీసిందని బాల్కనీలో నిలబడి అరవమంటావా? అప్పుల వాళ్ళు కోర్టుకి వెళ్తే జైలుశిక్ష తప్పదని నట్టింట్లో కూర్చుని ఏడవమంటావా?'' అని అరిచింది. ఆమె అంతలా అరవటం అతనెప్పుడూ చూడలేదు. అయితే ఆమె చెప్పినదంతా నిజమే. కళ్యాణీ ఏజెన్సీస్ ఒక పెద్ద కాంట్రాక్టు ఒప్పుకుంది. ఇన్సూరెన్స్ లేకుండా ఆ సరుకు మునిగిపోయిందంటే... నికరంగా రెండు కోట్లు నష్టం..! అన్ని వైపుల్నుంచీ ఒత్తిడి!

'ఇదంతా ఎలా జరిగింది? ఇన్సూరెన్స్ లేకుండా షిప్పింగ్ జరగదే...' స్వగతంగా అన్నాడు.

''జరగదు. పొరపాటు జరగడానికి వీల్లేదు. ఇన్సూర్ చేసినట్టు నటించి చివర్లో జాగ్రత్తగా ఎవరో మోసం చేశారు. బోంబే మాట్లాడాను. తెల్లవారుజాము నుంచీ ఆ పని మీదే ఉన్నాను.''

''అన్నట్టు...'' సాలోచనగా అన్నాడు సత్యం, ''నీ ఆస్తంతా ఆ కార్తికేయకి అమ్మేశావు కదూ?''

''అవును. కానీ అతడు తీసుకోలేదు. మొత్తం తిరిగిచ్చేసి, పైగా ఈ పెయింటింగ్స్‌ని బహుమతిగా ఇచ్చి వెళ్ళిపోయాడు.''

''ఇవ్వటం... తీసుకోవటం అతనిష్టం కాదు. అంతా లీగల్‌గా జరగాలి. అగ్రిమెంట్ జరిగింది. కానీ కాన్సిలేషన్ జరగలేదుగా'' అంటూ దగ్గరగా వచ్చి కూర్చున్నాడు సత్యం. ఒక సత్యాన్ని శోధించిన సంతోషం అతని మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది. ''నీ ఆస్తి... అంటే అందులో స్థిరాస్తులే కాకుండా అప్పులు కూడా ఉంటాయి. అన్నీ కలిపి అతను తీసుకున్నాడు''.

ఆమె అతని వైపు చురుగ్గా చూసింది. అతడేమి చెప్తున్నాడో అర్థమైంది. ఈ అప్పులకి తను బాధ్యురాలు కాదని తన లీగల్ సలహాదారు సలహా ఇస్తున్నాడు. ఓడ మునిగిపోవటానికి ముందే తను కళ్యాణీ ఏజెన్సీస్‌ని కార్తికేయకు అమ్మేసింది. కాబట్టి ఈ అప్పుకి అతనే బాధ్యుడు. తీర్చలేకపోతే– అ… త… డే… జైలుశిక్ష అనుభవించాలి!

ఆమె తల అడ్డంగా ఊపుతూ ''నో నేనొప్పుకోను. ఇది రాక్షసత్వం'' అంది. సత్యం నవ్వి ''అయ్యిండొచ్చు. కానీ దానికి మరో పేరే బిజినెస్'' అన్నాడు.

''అతడు దీనంతటికీ ఒప్పుకోకపోవచ్చు. ఈ లిటిగేషన్‌తో సంబంధం లేదని చాలా సులభంగా, న్యాయబద్ధంగా తప్పించుకోవచ్చు'' అంది కళ్యాణి.

''అదంతా కోర్టు కదా తేల్చేది. ఇక ఈ విషయంలో నువ్వేమీ కల్పించుకోకు'' అంటూ సత్యం ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ప్రతాపరెడ్డికి ఫోన్ చేశాడు. ''మొత్తం మీ డిటెక్టివ్‌లనందర్నీ పెట్టి ఆ కార్తికేయ ఎక్కడున్నాడో పట్టుకోండి. బహుశా కలకత్తా వెళ్ళే రైలులో దొరకవచ్చు. వెంటనే అతన్ని ఇక్కడికి తీసుకురండి''.

''ఏమిటీ? ఏమైంది?'' ఉత్సాహంగా అడిగాడు ప్రతాపరెడ్డి.

''తరువాత చెపుతాను'' అంటూ ఫోన్ పెట్టేశాడు. అప్పటి వరకూ ప్రేక్షకురాలిగా చూస్తున్న కళ్యాణి కల్పించుకుని ''నువ్వు తొందర పడుతున్నావేమో సత్యం'' అంది.

''లేదు. ఒక లీగల్ అడ్వయిజర్ హోదాలో నా పని చేస్తున్నాను.''

''నువ్వు చేస్తున్నది నైతికంగా తప్పు.''

''చట్ట బద్దంగా కరెక్టు'' అన్నాడు సత్యం.

అరగంటలో ప్రతాపరెడ్డి కారొచ్చి పోర్టికోలో ఆగింది. పోలీసు ఆఫీసరు నేరస్తుడిని తీసుకొచ్చిన లెవల్లో కార్తికేయని రెక్క పట్టుకుని దిగాడు.

''వెరీగుడ్. చాలా ఫాస్ట్‌గా పట్టుకున్నారే'' అన్నాడు సత్యం.

''ఇల్లెక్కడో పీటర్‌కి తెలుసు. వెళ్ళిపోవడానికి సామాన్లు సర్దుకుంటూంటే వెళ్ళి పట్టుకున్నాడు. ఏం చేశాడు ఇతడు? ఏదైనా దొంగతనం చేశాడా?'' కార్తికేయని అనుమానంగా చూస్తూ అడిగాడు రెడ్డి. సత్యం మొత్తం జరిగినదంతా చెప్పి కార్తికేయతో, ''మొత్తం ఆస్తంతా నువ్వు కొనుక్కున్నావా లేదా?'' గద్దించినట్టు అడిగాడు.

''కొనుక్కున్నాను. కానీ ఆ తరువాత నాకే సిల్లీగా అనిపించి తిరిగి ఇచ్చేశాను.''

''నీకెలా అనిపించింది అన్నదికాదు ప్రశ్న. శ్రీకళ్యాణీ ఏజెన్సీస్ నువ్వు కొనుక్కున్నావా లేదా? అది చెప్పు.''

''కొన్నాను.''

''నిన్న ప్రొద్దున్నించీ నువ్వు శ్రీకళ్యాణీ ఏజెన్సీస్ ప్రొప్రైటర్‌వి. అవునా, కాదా?''

‘‘అవును. ఎందుకు అడుగుతున్నారు ఇవన్నీ?’’

‘‘నిన్న రాత్రి ఏజెన్సీ సరుకు ఓడ మునిగిపోయింది. ఇన్సూరెన్స్ లేదు. రెండు కోట్లకు పైగా నష్టం వచ్చింది. యాభై లక్షలకు పైగా అప్పులు మిగుల్తాయి. మనకి కాంట్రాక్టు ఇచ్చిన వాళ్ళు కోర్టులో దావా వేస్తే ఏడు సంవత్సరాలకి తక్కువ కాకుండా శిక్ష పడుతుంది. శిక్ష ఎవరు అనుభవించాలి? నువ్వా? మేమా?’’

కార్తికేయ మొహం వాడిపోయింది. అతడి మొహంలో బాధ స్పష్టంగా కనబడుతోంది. అతడి విచారం చూసి సత్యం ‘భలే శాస్తి జరింగింది’ అన్నట్టు సంబరపడ్డాడు. ముగ్గురూ అతడి వైపే చూస్తున్నారు. నెమ్మదిగా కళ్యాణి దగ్గరకి వచ్చి, ‘‘ఎలా?… రాత్రికి రాత్రి అంతా పోతే మీరు… మీరెలా ఉంటారు మాడమ్?’’ అన్నాడు.

అతడు ఆలోచిస్తున్నది అతని గురించి కాదు. తన గురించి..! ఆమెకి ఆ భావం అర్థమై వెన్నులో జలదరింపు శరీరాన్ని సన్నగా వణికించింది. మొత్తం విషయం చెప్పేద్దామా అనుకుంది. ఆమె ఏదో అనబోతోంటే సత్యం కల్పించుకున్నాడు. ‘‘ఆమె ఎలా ఉంటుందన్నది నీకెందుకోయ్. ఆమె వెనుక మేమంతా లేమా? ఇంత దానికే  ఆమె బజారున పడుతుందా? ముందు నీ సంగతి చెప్పు. ఆమె ఆస్తులకీ, అప్పులకీ నువ్వు అగ్రిమెంటు వ్రాశావు కాబట్టి ఇప్పుడు అప్పుల వాళ్ళకి జవాబుదారీ నువ్వే! ఆ విషయం నువ్వొప్పుకుంటావా లేదా?’’

‘‘అవున్నేనే…’’

‘‘ఓడ మునిగిపోవడానికి ముందే అగ్రిమెంట్ అయింది కాబట్టి నష్టం నీదేనా కాదా?’’

‘‘నాదే. అప్పు చెల్లించాల్సిన బాధ్యత కూడా నాదే.’’

‘‘రేపు కళ్యాణిగారి మీద కోర్టుకి వెళ్ళినా కూడా నువ్వు నెగ్గలేవు. ‘‘

అతడు ఆశ్చర్యం చెందినట్టు కనిపించాడు. ‘‘… ఇంత చిన్న విషయానికి కోర్టులెందుకు? బహుశ ఇలాటి అపాయం తొందరలో రాబోతుందనే దేవుడు శ్రీకళ్యాణిగారికి ‘ఆస్తి అమ్మేయాలనే’… ఆలోచన కలిగించి ఉంటాడు. అయినా మనందరం ఉండి ఆమెని జైలుకి ఎలా పంపిస్తాం?’’

ఆ ‘రిటార్టు’కి సత్యం దెబ్బతిని, వెంటనే సర్దుకుంటూ, ‘‘అది సరే. ఆమె గురించి కాదు, నీ గురించి చెప్పు’’ అన్నాడు.

‘‘నేను ఒప్పుకుంటానన్నాగా. దీన్ని ఏ కోర్టులోనూ సవాలు చేయను. ఎందుకంటే…’’ అని వెళ్ళబోతూ ఆగి అన్నాడు. ‘‘న్యాయస్థానం కంటే మనస్థాపం పెద్ద శిక్ష’’.

‘‘అదేమిటి అంకుల్… సామాన్లు మళ్ళీ విప్పుతున్నావు?’’ అడిగింది ఇంటివాళ్ళ అమ్మాయి. ‘‘కలకత్తా వెళ్ళటం లేదమ్మా. ఇక్కడే ఉండిపోతున్నాను’’ అన్నాడు. ‘భలే భలే’’ అనుకుంటూ ఆ అమ్మాయి బయటకు పరుగెత్తింది. కార్తికేయకు నవ్వొచ్చింది. ‘ఇక్కడ’ అంటే ‘ఈ ఇంట్లో’ అనుకుంటూంది ఆ పిల్ల.

అతడు తన కుంచెలు, పెయింట్‌లూ తీస్తూండగా ''అంకుల్, నీ కోసం కారొచ్చింది'' అంటూ ఆ పాప మళ్ళీ బాణంలా లోపలికి వచ్చింది.. అతడు విస్మయంతో ''నా కోసం కారా'' అన్నాడు.

''అవును. ఇంతుంది'' అంది రెండు చేతులూ బార్లా చాపి. కార్తికేయ ఆశ్చర్యంగా బయటికి వచ్చాడు... వీధి మొదట్లో 'టయోటా' ఉంది. డ్రైవింగ్ సీటు దగ్గర ఉన్న శ్రీకళ్యాణిని చూస్తూ 'మీరా' అన్నాడు.

''బిజీగా ఉన్నారా?'' అని అడిగింది.

''నాలాటి వాడికి బిజీ ఏమిటి?''

''అయితే నాతో రండి. డిన్నర్‌కి వెళ్దాం.''

అతడు తల మునకలయ్యేటంత ఆశ్చర్యంతో ''మీతో కలిసి డిన్నర్‌కా'' అన్నాడు.

''ఎలాగూ మన ఆస్తంతా అప్పుల వాళ్ళకే కదా... అది పోయే లోపులో మనం వీలైనంత ఖర్చు పెట్టడం మంచిది. అఫ్‌కోర్స్, నేనిలా మాట్లాడితే మళ్ళీ మీరు నైతిక విలువలు, మానసిక సంస్కారం, వగైరాల గురించి చెపుతారేమో. రండి తొందరగా వెళ్దాం'' అంది నవ్వుతూ.

కారు మెత్తగా వెళుతోంది. ''ఏమైనా మాట్లాడండి.'' అంది. అతడు నవ్వి ''నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. మీరు మా ఇంటికి రావటం ఏమిటి? నన్ను డిన్నర్‌కి తీసుకువెళ్ళటం ఏమిటి?'' అన్నాడు.

''ఇందులో ఆశ్చర్యం ఏముంది.''

''ఆశ్చర్యంకన్నా భయం ఎక్కువ. మీతో ప్రారంభమైన ప్రతి సంఘటనా నన్ను ఒక ఊహించని మలుపులోకి తోసేస్తుంది.''

''ఇదే ఆఖరి మలుపులెండి...'' కారు హోటల్లోకి తిప్పుతూ అన్నది. ''... ఈ రాత్రి తరువాత నా తరఫు నుంచి మీకేమీ థ్రిల్స్ ఉండవు'' అంటూ కారు ఆపింది.

ఆమె తప్పు చెప్పింది.

వారి జీవితపు అతి ముఖ్యమైన మొట్టమొదటి మలుపు, అరగంట తరువాత ఆ హోటల్లోనే జరిగింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments